# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:21-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ జీఎస్టీ తగ్గింపు వల్ల పేదలు, మధ్యతరగతికి మేలు జరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ కనకదుర్గమ్మ వారి దసరా ఉత్సవాలు రేపటి నుంచి అక్టోబర్ 2 వరకూ జరగనున్నాయి.
- ❖ జీఎస్టీ నూతన సంస్కరణలతో ప్రజల ఆరోగ్య సంరక్షణకు మరింత భరోసా పెరుగుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- ❖ భారత్ పాకిస్తాన్ జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది.
- ❖ ఉత్తర బంగాళాఖాతంలో సెప్టెంబర్ 25న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

భావితరం జీఎస్టీ సంస్కరణలు రేపటి నుండి అమల్లోకి రానున్నాయి. ఈ నేపధ్యంలో కొద్దిసేపటి క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ... దేవీనవరాత్రుల సందర్భంగా రేపటి నుంచి జీఎస్టీ ఉత్సవ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ నూతన జీఎస్టీ సంస్కరణలు రాష్ట్రాల అభివృద్ధికి దోహదం చేస్తాయని ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు కూడా ప్రయోజనం చేకూరుస్తాయని చెప్పారు. ముఖ్యంగా జీఎస్టీ తగ్గింపు వల్ల పేదలు, మధ్యతరగతికి ఎంతో మేలు జరుగుతుందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

దేశవ్యాప్తంగా రేపటి నుంచి అమల్లోకి రానున్న జీఎస్టీ నూతన సంస్కరణలతో ప్రజల ఆరోగ్య సంరక్షణకు మరింత భరోసా పెరుగుతుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆరోగ్య బీమా ప్రీమియంపై ఇప్పటివరకు ఉన్న 18 శాతం జీఎస్టీని తొలగించినందున మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని ఆయన పేర్కొన్నారు. అలాగే జీఎస్టీ నూతన సంస్కరణల కారణంగా క్యాన్సర్ తో సహా అరుదైన ఇతర వ్యాధుల (33 రకాల) ఔషధాలు, సర్జరీలకు

సంబంధించిన పరికరాల ధరలు కూడా తగ్గనున్నాయని వెల్లడించారు. వ్యాక్సిన్లు, హెచ్ ఐవి, హెపటైటిస్, టీబీ డయాగ్నోస్టిక్ కిట్స్ ధరలు కూడా తగ్గుతాయని వీటి అవసరం కలిగిన వారికి ఆర్థికంగా ఉపశమనం కలుగనుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు.

============================

విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఆలయంలో కొలువుదీరిన కనకదుర్గమ్మ దసరా ఉత్సవాల షెడ్యూల్ ఈరోజు విడుదలయ్యింది. రేపటి నుంచి నుంచి అక్టోబర్ 2 వరకు ఈ దసరా ఉత్సవాలు జరగనున్నాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి వీకే శినా నాయక్ పాత్రికేయులకు వెల్లడించారు. 11 రోజుల పాటు అమ్మ వారు 11 వేరు వేరు అలంకారాలలో దర్శనమివ్వనున్నారు. రేపు బాలత్రిపుర సుందరి దేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబర్ 2వ తేదీన పూర్ణాహుతితో ఈ దసరా ఉత్సవాలు ముగియనున్నాయి. అదేరోజు సాయంత్రం 5 గంటలకు కృష్ణా నదిలో హంస వాహన తెప్పోత్సవం నిర్వహిస్తామని, సెప్టెంబర్ 29వ తేదీ మూలా నక్షత్రం రోజున ముఖ్యమంత్రి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఈవో శినా నాయక్ తెలియజేసారు.

============================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా స్మార్ట్ సిటీ మిషన్ పై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 105 సెకన్లు)

============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ వచ్చే ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

============================

ఆసియా కప్ సూపర్ ఫోర్ లో భాగంగా ఈరోజు భారత్ పాకిస్తాన్ జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ జరగనుంది. దుబాయ్ వేదికగా రాత్రి 8 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. ఇక ఆసియా కప్ సూపర్ ఫోర్ కు భారత్ పాకిస్తాన్ తో పాటూ శ్రీలంక, బంగ్లాదేశ్ కూడా అర్హత సాధించాయి. సూపర్ ఫోర్ లో ప్రతీ జట్టు మొత్తం 3 మ్యాచ్ లు ఆడనుంది. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెప్టెంబర్ 28న ఫైనల్ మ్యాచ్ ఆడతాయి.

============================

ఉత్తర బంగాళాఖాతంలో ఈ నెల 25న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ సెప్టెంబర్ 26న దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది.

============================

============================